




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక



GK MEDIA Voice of People
CHANNEL NO. 433
SSLC CABLE NETWORK
SSLC కేబుల్ నెట్‌వర్క్‌లో వస్తుంది



ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 332 | సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | గురువారం 10 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-


## అసెంబ్లీ ఘటనలపై క్రిమినల్ కేసులు

**- సీఎం రేవంత్ రెడ్డి**

- సభాపతి గడ్డం ప్రసాద్‌కు అండగా శాసనసభ
- కుట్రదారులపై సమగ్ర విచారణ, కఠిన చర్యలు ఖాయం
- ప్రజా సమస్యల చర్చను అడ్డుకునేందుకే ఈ దాడి
- తల్లిని అవమానించిన వారిని సమాజం క్షమించదు



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో చోటుచేసుకున్న కుట్ర పూరిత సంఘటనలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడి శాసనసభలో స్పష్టం చేశారు. తొలిరోజు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి దుర్భాషలాడటం, దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడం వంటి పరిణామాలపై అసెంబ్లీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ సభాపతికి పూర్తి మద్దతు ప్రకటించింది. బుధవారం సభలో జరిగిన సుదీర్ఘ చర్చకు సమాధానమిచ్చిన ముఖ్యమంత్రి, ఉన్మాదానికి లోనైన కొందరు ముష్కరులు అధికారులపై దాడులు చేస్తూ సభాపతిని, ఆయన తల్లిని అవమానించడం తీవ్రవాదుల చర్యలతో సమానమైన ఒక పథకం ప్రకారమే జరిగిందని ధ్వజమెత్తారు. భారతమాత, తెలంగాణ తల్లిగా స్త్రీని పూజించే ఈ గడ్డపై ఒక తల్లిని కించ పరచడాన్ని సమాజం ఉపేక్షించదని, రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర ఈ నేలకు ఉందని హెచ్చరించారు. ప్రజా స్వామ్యంలో నిరసనలకు హద్దులు ఉంటాయని, ఉద్దేశపూర్వకంగా సభా పతిని గాయపరిచిన వారిని చట్టపరంగా వదిలిపెట్టే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. సెప్టెంబర్ 7 నుంచి విద్యా రంగ సమస్యలు, ధరణి అక్రమాలు, 22(ఎ) వంటి కీలక ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చిం చాలని ప్రభుత్వం భావిస్తే, ఆ చర్చ జరగకుండా అడ్డుకునేందుకే ఈ దుర్మార్గమైన చర్యలకు పాల్పడ్డారని ముఖ్యమంత్రి ఆరోపించారు.

## అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు సహా సభ్యుల సస్పెన్షన్



- ఎర్రవల్లి వద్ద 'చావుడప్పు' నిరసనలపై బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన
- సభను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపణ
- బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌పై తీర్మానం
- సభ జరిగే అన్ని రోజులకూ సస్పెన్షన్ వర్తింపు
- అనంతరం సభ 10 నిమిషాలు వాయిదా

▸▸2

## గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ



- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ

▸▸2

## E20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు



- E20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్
- తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి
- ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు

▸▸2

## ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు.. ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు : హరీశ్ రావు



- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్
- బీఆర్ఎస్ సభ్యులను కక్షపూరితంగా సస్పెండ్ చేశారన్న హరీశ్
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నా-మనే భయంతోనే కుట్రలు చేస్తున్నారని మండిపాటు

▸▸2

## కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి అసెంబ్లీలో తీవ్ర దుమారం



- నిన్న కేసీఆర్ ఫాంహౌస్ వద్ద నిరసన తెలిపిన కాంగ్రెస్ ఎస్సీ విభాగం, దళిత సంఘాలు
- ఆ ప్రాంతాన్ని బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేశారన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్
- దళితుల పట్ల వివక్షను బీఆర్ఎస్ మరోసారి నిరూపించుకుందని మండిపాటు

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభ మూడో రోజు సమావేశాలు ప్రారంభం కాగానే సభలో తీవ్ర దుమారం చెలరేగింది. నిన్న సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతలు, దళిత సంఘాలు నిరసన తెలిపిన అనంతరం... బీఆర్ఎస్ నేతలు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేశారంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సభలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు నిరసన తెలిపి వెళ్లిన స్థలాన్ని శుద్ధి చేయడం వెనుక బీఆర్ఎస్ నాయకుల తీవ్రమైన ...

▸▸2

## ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!

**- కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ**



- ఒకరి చావును కోరడం సమర్థనీయం కాదన్న శంకర్
- సీఎం, స్పీకర్ లను బీఆర్ఎస్ నేతలు దూషిస్తున్నారని మండిపాటు
- కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని వ్యాఖ్య

▸▸2

## యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే.. బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు : బండి సంజయ్

- రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో అధికా-రంలోకి వచ్చేది బీజేపీనే అన్న బండి సంజయ్
- కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని వ్యాఖ్య
- పోలీసుల కేసులకు భయపడాల్సిన అవసరం లేవన్న సంజయ్



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి ....

▸▸2

# కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి అసెంబ్లీలో తీవ్ర దుమారం

**మొదటిపేజీ తరువాయి..** కులతత్వం బయటపడిందని... ఇది యావత్ దళిత సమాజ ఆత్మగౌరవాన్ని, హక్కులను తీవ్రంగా అవమానించడమేనని విమర్శించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీ గేటు వద్ద బూతులు తిట్టిన అంశాన్ని మరిచిపోకముందే... బీఆర్ఎస్ మరోసారి దళితుల పట్ల తమకున్న వివక్షను నిరూపించుకుందని మండిపడ్డారు. ఈ శుద్ధి వ్యవహారంపై సభలో సమగ్ర చర్చ జరగాలని ఆయన పట్టుబట్టారు. మరోవైపు, మంత్రి ప్రసంగానికి అడ్డుతగులుతూ బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై, వారిపై జరిగిన అనుచిత ప్రవర్తనపై ప్రభుత్వం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఇరువైపులా నేతల పోటాపోటీ నినాదాలు, హంగామాతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.

### యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..

# బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

**- బండి సంజయ్**

**మొదటిపేజీ తరువాయి..**
అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు

**- మహేశ్ గౌడ్**

- కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకోలేదన్న మహేశ్ గౌడ్
- కేసీఆర్ గతంలో గాయపడినప్పుడు సీఎం రేవంత్ వెంటనే స్పందించారని వెల్లడి
- కేసీఆర్‌కు రాష్ట్రంలో అత్యధిక భద్రత ఉందని వివరణ
- సిరిసిల్లలో సీఎం రేవంత్‌కు పిండ ప్రదానంపై మహేశ్ గౌడ్ ప్రశ్నలు
- హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని వ్యాఖ్య



**నేటి శుభోదయం, హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలే సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవరిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కేసీఆర్ గతంలో బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారని చెప్పారు. అర్ధరాత్రి గ్రీన్ ఛానల్ ద్వారా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు సీఎం స్వయంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. సీఎం తర్వాత రాష్ట్రంలో అత్యధిక భద్రత పొందుతున్న వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలు పిండ ప్రదానం చేయడం ఎంతవరకు సమంజసమని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. స్పీకర్ పదవిపై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన వ్యాఖ్యలపైనా ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలను తెలంగాణ సమాజం ఖండిస్తోందన్నారు. కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన సొంత కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని చెప్పారు. కేసీఆర్‌పై కాంగ్రెస్‌కు గౌరవం ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. ఆయన త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. దళితులు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు సహా సభ్యుల సస్పెన్షన్

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, కోవా లక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఈ సెషన్‌లో సభ జరిగే అన్ని రోజులకు ఈ సస్పెన్షన్ వర్తించనుంది. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే బీఆర్ఎస్ సభ్యులు నిన్నటి ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద 'చావుడప్పు' నిరసనలపై ఆందోళనకు దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. దాదాపు గంటసేపటి నుంచి బీఆర్ఎస్ సభ్యులు సభను అడ్డుకుంటున్నారని మంత్రి తెలిపారు. వారిని సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.

# గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

**మొదటిపేజీ తరువాయి..** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

# ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..

## ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. "ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి' అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే ప్రతిపక్షం గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నియంతృత్వం ఎంత పెరిగితే.. ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుంది అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని ఆయన హెచ్చరించారు.

# ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!

## - కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ

**మొదటిపేజీ తరువాయి..** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చల్లో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ?" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్ర నేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

# E20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు..

**మొదటిపేజీ తరువాయి..** ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసనసభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

## మంథనిలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేకు ప్రజలు సహకరించాలి

### - జాతీయ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్



**మంథని, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్)–2026లో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని మంథని పట్టణంలో సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ ఆరిఫొద్దిన్, ఎంపీడీవో శ్రీజ, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మేనేజర్ శారదలను కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేసి సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వివరించారు. దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలకు సంబంధించిన విశ్వసనీయ గణాంకాలను రూపొందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి దశలో కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేసిన అనంతరం, ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెల ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులతో పాటు జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పనిచేస్తున్న గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల వివరాలను కూడా నమోదు చేస్తామని తెలిపారు. సర్వే ద్వారా సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి సందేహాలకు తావులేకుండా సరైన సమాచారాన్ని అందించి సర్వే విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంథని డివైస్ఓ వెంకటేశ్వర్లు, మంథని ఎంపీఎస్ఓ సంధ్యారాణి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ ఉపాధ్యాయుల ప్రతిభకు గుర్తింపు

- గణితం, సాంఘికశాస్త్రంలో విశిష్ట సేవలకు అవార్డులు
- ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి



**మంథని, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందిస్తూ విశిష్ట సేవలందించిన కాకతీయ పాఠశాల ఉపాధ్యాయులు దేవేందర్, శరత్ ఉత్తమ ప్రైవేటు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గణిత ఉపాధ్యాయుడు దేవేందర్, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు శరత్‌లను బుధవారం పాఠశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ట్రస్మా అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, మండల విద్యాధికారి సురేందర్, జిల్లా ట్రస్మా అధ్యక్షుడు కేశవరెడ్డి వారిని అభినందించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి లభించిన గుర్తింపుగా ఈ అవార్డులను అభివర్ణించారు. తమ పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఉత్తములుగా ఎంపిక కావడం గర్వకారణమన్నారు. విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించేందుకు ఉపాధ్యాయులు అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

## ఎస్ ఐ ఆర్ హియరింగ్ గ్రామ సభలో పాల్గొన్న సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్



**పినపాక, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా నేడు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కరకగూడెం మండలంలోనీ 34వ బూత్ పరిధిలో నోటీసులు జారీ చేసిన ఓటర్ల ఆధారాల పరిశీలనకు సంబంధించి ఏ ఈ ఆర్ ఓ , విచారణ అధికారి వట్టం కాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన హియరింగ్ గ్రామ సభలో పాల్గొన్న కరకగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోటీసులు అందుకున్న ఓటర్లు ఆధార్ కార్డుతో పాటు సూచించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో తమకు వర్తించే ఆధారాలను అధికారుల ముందు సమర్పించి విచారణ ప్రక్రియకు సహకరించాలని కోరారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను అధికారులు, బి ఎల్ ఓ క్లుప్తంగా స్పష్టంగా వివరించాలని ఓటర్లు కూడా తమ ఆధారాలను సకాలంలో సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును కాపాడుకునే విధంగా అవసరమైన ఆధారాలను సమర్పించి, ఎన్నికల అధికారులు నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో కరకగూడెం సర్పంచ్ పోలేబోయిన సుజాత , బి ఎల్ ఓ లు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుఃఖం లో భరోస ఇవ్వడం మానవత్వానికి ప్రతీక

### రాజేశ్వర్‌రెడ్డి, మహేష్‌ప్రసాద్ లను కుటుంబాలను పరామర్శించిన జర్నలిస్టు నాయకులు



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** ఆప్తులను కోల్పోయిన కుటుంబాలను పరామర్శించి, వారి దుఃఖంలో సైతం భాగస్వాములమని భరోసగా నిలిచారు జర్నలిస్ట్ నాయకులు. మల్కాజిగిరి, నగరంలోని అల్వాల్ ప్రాంతాలకు చెందిన జర్నలిస్టు నాయకులు చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి వెళ్లి ఇటీవల మాతృ, పితృ వియోగాలకు గురైన రెండు కుటుంబాలను కలసి పరామర్శించారు.మల్కాజిగిరి ప్రాంతంలో జర్నలిస్టుగా విధులు నిర్వహిస్తున్న కె.ఆర్.ఆర్. ట్రస్ట్ నిర్వాహకులు కె. రాజేశ్వర్‌రెడ్డి మాతృమూర్తి ప్రమీల ఇటీవల మృతి చెందడంతో జర్నలిస్టు నాయకులు వారి స్వగ్రామమైన ఆకునూరుకు వెళ్లి రాజేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అల్వాల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సుక్కా రవి, మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డమీది గిరి తదితరులు రాజేశ్వర్‌రెడ్డిని ఓదార్చి, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా సుక్కా రవి, గడ్డమీది గిరి మాట్లాడుతూ.. రాజేశ్వర్‌రెడ్డి తల్లిదండ్రులు ఎంతో మంచితనం, ఆత్మీయత, మానవతా విలువలతో జీవించిన వ్యక్తులని, వారితో పరిచయం ఉన్న ప్రతి ఒక్కరి హృదయాల్లో మంచి జ్ఞాపకాలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. రాజేశ్వర్‌రెడ్డి సైతం సౌమ్య స్వభావంతో, అందరినీ ఆత్మీయంగా పలకరించే స్నేహశీలి అని, జర్నలిస్టు వర్గాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండే వ్యక్తిగా ఆయనకు మంచి పేరు ఉందని అన్నారు. తల్లిని కోల్పోయిన బాధను మాటల్లో చెప్పలేమని, ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి జర్నలిస్టు సమాజం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**- జర్నలిస్ట్ మహేష్ ప్రసాద్ కు పరామర్శ :**

నేరేడు మెట్ ఈనాడు సీనియర్ జర్నలిస్టు కన్నోజు మహేష్‌ప్రసాద్ తండ్రి ఇటీవల అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబాన్ని కూడా జర్నలిస్టులు పరామర్శించారు. మహేష్‌ప్రసాద్‌ను ఓదార్చి, తండ్రి మృతి పట్ల సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహేష్ ప్రసాద్ స్నేహశీలి, సౌమ్యుడు, సహచరులతో ఆత్మీయంగా మెలిగే వ్యక్తి అని, అలాంటి వ్యక్తి కుటుంబంలో చోటుచేసుకున్న విషాదం తమను కూడా కలిచివేసిందని పేర్కొన్నారు.

జీవితంలో ఆప్తులను కోల్పోయిన సమయంలో మాటలకంటే తోడుగా నిలిచే మనుషులే గొప్ప ధైర్యాన్ని ఇస్తుందని , కావున జర్నలిస్టు మిత్రుల కుటుంబాల్లో విషాదం చోటుచేసుకున్నప్పుడు తామంతా ఒక కుటుంబంలా అండగా నిలుస్తామని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అల్వాల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సుక్కా రవి, మల్కాజిగిరి ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గడ్డమీది గిరి, ఈనాడు సీనియర్ పాత్రికేయులు తిరునగరి రమణయ్య, కాకుమాని సుబ్బారావు, సాక్షి మాజీ పాత్రికేయులు కొమ్ము యాదయ్య, ప్రముఖ న్యాయవాది నరసింహారావు, ఆర్థిక నిపుణులు లలిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నాయుడు కుంటను తక్షణమే శుభ్రం చేయాలి

### - కమిషనర్ కు కర్నే రవి ఫిర్యాదు





**మణుగూరు, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** రాబోయే బతుకమ్మ పండుగను దృష్టిలో ఉంచుకుని మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని నాయుడు కుంటను తక్షణమే శుభ్రపరిచి, మహిళలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి కోరారు.ఈ మేరకు ఆయన బుధవారం మణుగూరు పురపాలక సంఘం మున్సిపల్ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు నాయుడు కుంట వద్దకు చేరుకుని బతుకమ్మలను నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.అయితే ప్రస్తుతం నాయుడు కుంట పరిసరాలు, చెరువు గట్టు వద్ద చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయని, చెరువు నీటిలో నాచు, గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బతుకమ్మ నిమజ్జనం కోసం వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు.పారిశుధ్య సమస్యతో పాటు చెరువు వద్ద భద్రతాపరమైన ఇబ్బందులు కూడా తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కర్నే రవి కోరారు. పండుగకు ముందే చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా తొలగించి, చెరువులోని గుర్రపుడెక్క, నాచు, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరచాలని విజ్ఞప్తి చేశారు.అలాగే బతుకమ్మ నిమజ్జన ప్రాంతంలో తగిన లైటింగ్, భద్రతా ఏర్పాట్లు చేపట్టి మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. బతుకమ్మ పండుగకు ముందుగానే ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి నాయుడు కుంటను నిమజ్జనాలకు అనువుగా సిద్ధం చేయాలని కర్నే రవి మున్సిపల్ అధికారులను కోరారు.

# గణేష్ ని నవరాత్రి ఉత్సవాల్లో రూల్స్ అతిక్రమిస్తే కేసులు తప్పవు

- యాచారం ఎస్ ఐ సతీష్ కుమార్,ఏ ఎస్ ఐ సక్రు నాయక్



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** యాచారం మండల పరిధిలోని యాచారం పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక చవితి నవరాత్రుల ఉద్దేశించి అవగాహన సదస్సులో ఎస్సై సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి గణేష్ ని మండ పానికి పర్మిషన్ కచ్చితంగా తీసుకోవాలి. అదేవిధంగా మండపం ఆవరణలో ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలు కచ్చితంగా పాటించాలి అన్నారు. డీజే లాంటి సౌండ్ పొల్యూషన్ ఏ మాత్రం సహించమని ఆ రూల్స్ ను పాటించకుంటే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని అన్నారు. మండపం వద్ద తగు జాగ్రత్తలు పాటించాలి. దేవుడు దీపం వద్ద ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో వినాయక కమిటీ సభ్యులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలి.వినాయకుని పెడుతున్నటువంటి యువజన సంఘాలు నవరాత్రుల అయ్యేంతవరకు బాధ్యతా యుతంగా ఉండాలి. తప్పనిసరిగా తొమ్మిది రోజులకు మించకుండా వినాయ కుడి ఉంచకూడదని అన్నారు. సాధ్యమైనంతవరకు 9 రోజుల్లో వినాయకుడి నిమజ్జనం జరిగే విధంగా అందరూ బాధ్యత తీసుకోవాలి అన్నారు. ఎలక్ట్రిసిటీ సౌకర్యం కోరిన పిదప అన్ని రకాల అనుమతులు తీసుకోగలరు. ఈ అవగాహన సదస్సులో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మస్కు నరసింహ, చింతపట్ల గ్రామ సర్పంచ్ తొట్ట రమేష్ , చింతపట్ల యువకులు మోత్కుపల్లి రమేష్ , కోండ్ర శంకర్ యాచారం మండల పలు గ్రామాల నుంచి యువకులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ గ్రామల సర్పంచులు, యాచారం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## సబితా ఇంద్రారెడ్డిపై దాడి హేయమైన చర్య - చైతన్య కిరణ్



**వికారాబాద్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** వికారాబాద్ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై జరిగిన దాడిని బీఆర్ఎస్ నాయకుడు, అడ్వకేట్, యువ చైతన్యం ట్రస్ట్ చైర్మన్ చైతన్య కిరణ్ మల్కాపురం తీవ్రంగా ఖండించారు. ప్రజాప్రతినిధిపై భౌతిక దాడికి తెగబడటం ప్రజా స్వామ్య విలువలకు తీవ్ర విరుద్ధమని, ఇది సమాజంలో ఆందోళనకరమైన వాతా వరణాన్ని సృష్టిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయ కక్షసా ధింపు ధోరణితోనే బీఆర్ఎస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన వారిపై ప్రభుత్వం, పోలీసు శాఖ తక్షణమే స్పందించి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టకపోతే ప్రజాస్వామ్య పునాదులే ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, భావప్రకటనా స్వేచ్ఛ కోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ ముందుండి పోరాడతారని స్పష్టం చేశారు.

## బాల్యవివాహాలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు

- సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు



**ఇల్లందు, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** బాల్యవివాహాలు నిర్వహించిన మరియు సహకరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు సూచించారు. బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవం గా ఐక్యరాజ్యస మితి ప్రతిపాదించిన నవంబర్ 27వ తారీకు ను పురస్కరించుకొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ సభ్యులు ఎస్పీ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎవరైనా బాల్యవివాహాలు చేసిన సహకరించిన వారిపై బాల్య వివాహ నిరోధక చట్టం మరియు పోక్సో యాక్ట్ కూడా విధించబడుతుందని తెలిపారు. బాల్యవివాహాలు జిల్లాలో ఎక్కడైనా జరుగుతున్నట్లు సమాచారం తెలి సినట్లయితే వెంటనే 1098 లేదా డయల్ 100 లేదా జస్ట్ రైట్స్ వారికి తెలియజే యాలని కోరారు, ఈ కార్యక్రమానికి ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి రాజేష్ సభ్యులు మోహన్ మాన్సింగ్ రవిచంద్ర నాగేంద్రబాబు మౌనిక పాల్గొన్నారు.

# మన యాస, భాష ను గౌరవించుకుందాం

- ఆశ్రమ పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**ఏన్కూర్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** కాళోజి నారాయణరావు112వ.జ యంతి ని పురస్కరించుకొని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూల పోచారం పాఠశా లలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధా నోపాధ్యాయులు జి. నాగరాజు,డిప్యూటీ వార్డెన్ డిఎస్. నాగేశ్వర రావు మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని,వారి భాషను, సంస్కృతిని తన రచనల ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత కవి అని పేర్కొన్నారు. “ప్రజల భాషే నా భాష, ప్రజల బాధలే నా కవిత్వం” పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశా ని ది అనే భావంతో ఆయన జీవితాంతం ప్రజల పక్షాన నిలిచారని తెలిపారు.విద్యార్థులకు కాళోజి జీవితం, సాహిత్యం, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర గురించి వివరించారు.విద్యార్థులు కాళోజి రచనలు, కవితలు,సూక్తు లను ఆలపించి,పఠించి ఆయనకు ఘన నివాళులర్పించారు. తెలంగాణ యాస, భాషను గౌరవించి, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉపాధ్యాయులు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి. శోభన్ నాయక్, బి.రవి, ఎం.చంద్రరావు, బి.రవి,పాయం శ్రీనివాస్,బి.సింగ్య,జే.నా గేశ్వరరావు,కే.శ్యామల, బి.శారదాబాయి, డి.ఉషశ్రీ, పాఠశాల విద్యార్థులు,నాలుగో తరగతి ఉద్యోగులు బి.కపుర్య,వీరు,సుజాత, పద్మ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమం చివరలో కాళోజి ఆశ యాలను కొనసాగిస్తూ తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

# తెలంగాణ ఆదర్శ పాఠశాల & కళాశాలలో విద్యార్థులను స్వాగతిస్తూ ఫ్రెషర్స్ పార్టీ ఉత్సవాలు







**నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** సిరికొండ మండల కేంద్రంలోని పీ యం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల&కళాశాలలో నూతనంగా కళాశాలలో చేరిన విద్యార్థులను స్వాగతిస్తూ ఫ్రెషర్స్ పార్టీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, సీనియర్ మరియు జూనియర్ విద్యార్థుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో విలువైనదని, ఈ దశలోనే భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషితో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరో హించవచ్చని తెలిపారు. చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా,సామాజిక కార్యక్రమాల్లో కూడా విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు.నూతన విద్యార్థులకు కళాశాల వాతావరణం పట్ల సానుకూల భావన కలిగేలా, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేలా ఫ్రెషర్స్ పార్టీని నిర్వహించడం అభినందనీయమని MPO తారాచంద్ పేర్కొన్నారు. విద్యార్థులు తమలోని భయాలు, సంకోచాలను అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. నూతన విద్యార్థులకు కళాశాల కుటుంబం తరఫున హృదయపూర్వక స్వాగతం పలికారు.విద్యార్థులు కళాశాలలోని అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యా రంగంలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు, తమలోని ప్రతిభను అన్ని రంగాల్లో ప్రదర్శించాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, క్రమ శిక్షణ ఎంతో అవసరమని తెలిపారు.కళాశాలలో స్నేహపూ ర్వక వాతావరణాన్ని పెంపొందించుకోవాలని, పరస్పరం గౌరవించుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు.ఫ్రెషర్స్ పార్టీ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పాటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించి సందడి చేశారు. నూతన విద్యార్థులు తమలోని ప్రతిభను ప్రదర్శించగా, సీనియర్ విద్యార్థులు వారికి ఆత్మీయ స్వాగతం పలికారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.వి ద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నూతన విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపే విధంగా కార్యక్రమాన్ని విజ యవంతంగా నిర్వహించడంతో విద్యార్థులు, అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి, ఉపాధ్యాయులు,బోధనేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# చేవెళ్ల - హైదరాబాద్ బస్సులు లేక విద్యార్థుల అవస్థలు

## సర్వీసులు పెంచి సమయానుకూలంగా నడపాలి: ఎస్ఎఫ్ఐ

**వికారాబాద్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** వికారాబాద్ డిపో నుంచి చేవెళ్ల మీదుగా హైదరాబాద్‌కు సరిపడా బస్సు సర్వీసులు లేక విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ అన్నారు. బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వికారాబాద్ బస్టాండ్‌లో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ ఉదయం కళా శాలలకు వెళ్లే విద్యార్థులకు, సాయంత్రం తిరిగి ఇళ్లకు చేరుకునేం దుకు అనుకూలమైన సమయాల్లో బస్సులు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపా రు. ముఖ్యంగా సాయంత్రం 4 గంటల తర్వాత 6 గంటల వరకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు ఎదు ర్కొంటున్నారని పేర్కొన్నారు. తాం



దూరు నుంచి హైదరాబాద్‌కు కూడా బస్సుల కొరత ఉందన్నారు.ప్రజల ఇబ్బందులపై డిపో అధికారులు స్పందించి, సాధారణ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సు సర్వీసులను పెంచి సమ యపాలనతో నడపాలని డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసనసభా పతి గడ్డం ప్రసాద్‌కుమార్ ఉన్నప్పటికీ జిల్లాలో బస్సుల కొరత కొనసాగడం విచారకరమన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి ప్రయాణికుల సమస్యను పరిష్కరించా లని కోరారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాండు, చైతన్య, సాయి, తేజ, ఆమిర్, జుబేర్, మల్లికార్జున్, శివతో పాటు విద్యార్థులు, ప్రయాణి కులు పాల్గొన్నారు.

## ఫేక్ మార్ఫింగ్,ఏఐ జనరేటెడ్ చిత్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

### - బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు,ప్రజాప్రతినిధులను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా,వివిధ డిజిటల్ వేదికల్లో మార్ఫింగ్ చేసిన తప్పుడు మరియు ఏఐ ద్వారా రూపొందించిన చిత్రాలు,దుష్ప్రచార కంటెంట్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తున్న వారిపై తక్షణమే దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ శాసనసభా పక్షం ఎమ్మెల్యేలు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి,శ్రీ.బండారు లక్ష్మారెడ్డి,శ్రీ.పల్ల రాజేశ్వర్ రెడ్డి మరియు ఎమ్మెల్సీ మధుసూదన్ చారి గార్లు ఈ మేరకు తెలంగాణ డీజీపీకి మహేష్ మురళీధర్ భగవత్ IPS.DGP (Law & Order) గారికి బీఆర్ఎస్ శాసనసభాపక్షం తరపున ఫిర్యాదు అందజేశారు. రెండు రోజుల క్రితం తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు,ఇతర ప్రజాప్రతినిధులపై జరిగిన దాడి,దురుసు ప్రవర్తన ఘటనల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కావాలనే ఫేక్ డిజిటల్ కంటెంట్‌ను సృష్టించి ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఫేక్/ఏఐ జనరేటెడ్ చిత్రాలను నిజమైనవిగా చూపిస్తూ ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందడంతో పాటు ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని బీఆర్ఎస్ శాసనసభా పక్షం పేర్కొంది.సైబర్ క్రైమ్ విభాగం వెంటనే ఫేక్,మార్ఫింగ్,ఏఐ జనరేటెడ్ చిత్రాలు పోస్టులను గుర్తించి దర్యాప్తు చేయాలి.వాటిని రూపొందించి అప్‌లోడ్ చేసి ప్రచారం చేసిన వ్యక్తులను గుర్తించాలి.చిత్రాలపై సాంకేతిక ఫోరెన్సిక్ దర్యాప్తు నిర్వహించాలి. సైబర్ క్రైమ్, పరువునష్టం,తప్పుడు సమాచార ప్రచారం తదితర వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలి.సంబంధిత డిజిటల్ ఆధారాలు,అకౌంట్ వివరాలు, URLలు, టైమ్‌స్టాంప్‌లు, మెటాడేటాను భద్రపరచాలి. తప్పుడు మార్ఫింగ్ కంటెంట్ వ్యాప్తిని అడ్డుకుని ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాలి.రాజకీయ భేదాలు ఉన్నాయనే కారణంతో ఎన్నికైన ప్రజాప్రతినిధులపై కల్పిత డిజిటల్ కంటెంట్‌ను తయారు చేసి ప్రచారం చేయడం సమర్థనీయం కాదని బీఆర్ఎస్ శాసనసభాపక్షం స్పష్టం చేసింది.అలాగే అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలో పోలీసుల వైఖరిపై, అలాగే సంబంధిత కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.ఈ మొత్తం వ్యవహారంపై నిష్పక్షపాతంగా,అత్యవసరంగా దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు.

## రావులపాడులో సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు శ్రీకారం



**ఇల్లందు, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** కోయగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రావులపాడు గ్రామంలో సీసీ డ్రైన్ నిర్మాణ పనులను ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , గ్రామ సర్పంచ్ కోరం సుభాష్ చంద్రబోస్ కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అవసరమైన డ్రైనేజీ సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్'బాకీ కార్డు'ల డ్రామాపై కాంగ్రెస్ విరుచుకుపాటు

### - పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీలేవని నిలదీసిన పులి శివకుమార్

**కూకట్పల్లి, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** శాసనసభ వేదికగా ప్రజల సమస్యలు చర్చించకుండా నిత్యం కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు, అసూయ, ద్వేషం గుప్పించడమే పనిగా పెట్టుకున్న బిఆర్ఎస్ నాయకుల వైఖరిపై బాలానగర్ కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులకు కనీస సహనం, ఓపిక లేకపోవడం శోచనీయమని పులి శివకుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై బిఆర్ఎస్ నేతలు "బాకీ కార్డులు" పంచుతూ తిరగడంపై ఘాటుగా స్పందించారు... పదేళ్ల తమ హయాంలో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని బాలానగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ బిఆర్ఎస్ నాయకత్వాన్ని ప్రశ్నించారు.

**హామీల అమలుపై నిలదీత:** దళిత ముఖ్యమంత్రి ఏరి?: దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి ఎన్నికల తర్వాత కెసిఆర్ పీఠమెక్కారని, అప్పుడు ఈ బాకీ కార్డు ఏమైందని నిలదీశారు. ఇది ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.మూడు ఎకరాల భూమి ఏది?: ప్రతి దళిత కుటుంబానికి 3 ఎకరాల భూమి ఇస్తామన్న వాగ్దానం నిలబెట్టుకోనప్పుడు బిఆర్ఎస్ నాయకుల బాకీ కార్డు ఎందుకు బయటకు రాలేదని ఎండగట్టారు.రేషన్ కార్డులు నిరాకరణ: పదేళ్ల సుదీర్ఘ పాలనలో ఒక్క కొత్త తెల్ల రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, అప్పుడు ప్రజలకు బిఆర్ఎస్ బాకీ పడలేదా అని మండిపడ్డారు.ఆరోగ్యశ్రీ నిర్లక్ష్యం: రాజీవ్ ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించక పేదలు ఆస్పత్రుల్లో అల్లాడిపోయినప్పుడు బిఆర్ఎస్ బాకీ కార్డు ఏమైందని ప్రశ్నించారు.బిఆర్ఎస్ నాయకులు



ఇప్పటికైనా విమర్శలు పక్కన పెట్టి, పదేళ్ల తమ అధికారంలో ఎన్ని హామీలు పూర్తయ్యాయో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రాజకీయ ప్రయోజనాల కోసం ద్వేషాన్ని చిమ్మడం మాని, తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వానికి సహకరించాలని బాలానగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ కోరారు.

## కొండారెడ్డిపల్లి 2వ వార్డులో డ్రైనేజీ అభివృద్ధి పనులకు శ్రీకారం

### రాజేశ్వర్‌రెడ్డి, మహేష్‌ప్రసాద్ లను కుటుంబాలను పరామర్శించిన జర్నలిస్టు నాయకులు



**కేశంపేట, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలోని రెండోవ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్, డిప్యూటీ సర్పంచ్ కర్నెకోట నరేష్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు.వార్డులో మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, నీరు సక్రమంగా ప్రవహించేలా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. పనులు పూర్తయితే మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా మారి ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణం అందుబాటులోకి వస్తుందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు.2వ వార్డు సభ్యుడు అరవింద్ ప్రజాపతి మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. వార్డు అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో వార్డును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్, జగన్మోహన్ రెడ్డి, సురం శ్రీను, దశరథ్, రామకృష్ణ రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి - సర్పంచ్ గుండాల అశోక్

**షాబాద్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** షాబాద్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫారాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అశోక్ విద్యార్థులకు యూనిఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులను విశ్రాంత ఉపాధ్యాయుడు లింగప్ప సన్మానించారు. అదేవిధంగా పాఠశాలకు గేటు, ప్రహరీ ఏర్పాటుకు సహకరించిన దాతలు గడ్డం చంద్రయ్య, మధుసూదన్ గౌడ్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ ఘనంగా సన్మానించారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి దాతలు, గ్రామస్థులు ముందుకు రావాలని పాఠశాల నిర్వాహకులు కోరారు. విద్యార్థుల సౌకర్యార్థం యూనిఫారాలు అందించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ ఛైర్మన్ రామకృష్ణ, గ్రామస్థుడు అష్మత్ పాషా, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## గోలియాతండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



**ఇల్లందు, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** టేకులపల్లి మండల పరిధిలోని గోలియాతండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఇల్లందు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, వాటి నిర్వహణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న బాత్రూమ్‌లను, ఆర్‌వోఆర్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి, వాటి వినియోగం, నిర్వహణకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాత్రూమ్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి సూచించారు. పనులు ఆలస్యం చేస్తే ఈ విషయాన్ని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తుందని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.అనంతరం పాఠశాలలోని స్టోర్‌ను తనిఖీ చేసి, స్టోర్ తాళాల నిర్వహణ, అందుబాటులో ఉన్న సామగ్రి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం, స్వచ్ఛమైన తాగునీరు, అవసరమైన మౌలిక సదుపాయాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా విద్యార్థుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.ఈ తనిఖీలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు లకావత్ లాలు, శేఖర్, ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్పీ జాతీయ సదస్సు ఘనంగా నిర్వహణ

- పాల్గొన్న రూరల్ మండలాల ఇంచార్జ్ లు



**నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** వరంగల్ జిల్లా లో జరిగిన ఎమ్ ఆర్ పి ఎస్ సదస్సుకు జిల్లా నుండి పాల్గొన్న నాయకులు వరంగల్ నగరంలో నిర్వహించిన ఎమ్ ఆర్ పి ఎస్ (MRPS), ఎమ్ ఎస్ పి (MSP) జాతీయ సదస్సు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారు హాజరై ప్రసంగించారు.రాబోయే రోజుల్లో చేపట్టబోయే ఉద్యమ ప్రయాణం, భవిష్యత్తు కార్యాచరణపై నాయకులకు, కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధన, వర్గాల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణతో, పట్టుదలతో పోరాడాలని పిలుపునిచ్చారు.ఈ జాతీయ సదస్సులో జిల్లా ఇంచార్జ్ మసాయిపేట యాదగిరి,నిజామాబాద్ రూరల్ ఇంచార్జ్ గందమాల నాగభూషణం మాదిగతో పాటు పలు మండలాల ఇంచార్జ్‌లు చురుగ్గా పాల్గొన్నారు. ధర్పల్లి ఇంచార్జ్ నక్క రాజేందర్, రూరల్ మండలం ఇంచార్జ్ యాదసి రాములు మాదిగ, డిచ్‌పల్లి ఇంచార్జ్ దప్పు నర్సయ్య మాదిగ, ఇందల్వాయి ఇంచార్జ్ సంగేమ్ కిష్టయ్య మాదిగ, సిరికొండ ఇంచార్జ్ మొట్టల దీపక్ మాదిగ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.సదస్సు ముగింపులో కార్యకర్తలు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు సాగుతామని పునరుద్ఘాటించారు.

## స్కూల్ పిల్లలకు యూనిఫాంలు,బూట్లు అందజేత



**నిజామాబాద్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** డొంకేశ్వర్ మండలం తోండాకూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,అంగన్వాడి విద్యార్థులకు యూనిఫామ్లు,బూట్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అల్లూరి గంగాధర్, ఉప సర్పంచ్ మజారుద్దీన్, ప్రధానోపాధ్యాయుడు లింగారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, విడీసీ సభ్యులు చిన్నముత్తేన్న, భూమేష్, ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ టీచర్ వినోద, ఆయా పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ నుండి జిల్లా పబ్లిసిటీ సెల్ కన్వీనర్ గా నియామక పత్రాన్ని అందుకుంటున్న ఆనంద్ వ్యాస్

**జిల్లా పబ్లిసిటీ సెల్ కన్వీనర్ గా ఆనంద్ వ్యాస్ నియామకం**



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా పబ్లిసిటీ సెల్ కన్వీనర్ గా రాంగోపాల్ పేట్కు చెందిన బిజేపీ సీనియర్ నాయకులు ఆనంద్ వ్యాస్ నియమించబడ్డారు. ఈ మేరకు జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు గుండుగోని భరత్ గాడ్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆనంద్ వ్యాస్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో జిల్లా స్థాయి పదవిని అప్పగించిన భరత్ గౌడ్ కు ధన్యవాధాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, పార్టీ కార్యక్రమాలను తనవంతుగా విస్తృత ప్రచారం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రదాన కార్యదర్శులు సారంగపాణి, నెమలి ఆనంద్. రమేష్ రామ్. జిల్లా కార్యాలయ కార్యదర్శి కిరణ్ కుమార్, రాంగోపాల్ పేట్ డివిజన్ అధ్యక్షులు భవర్లాల్ సందీప్ వర్మ, ప్రధాన కార్యదర్శి అనిష్ పర్మ తదితరులు పాల్గొని ఆనంద్ వ్యాస్ కు శుభాకాంక్షలు తెలిపారు.

# కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఘన స్వాగతం

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** భద్రాచలం పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రి సారపాకలోని ఐటీసీ అతిథి గృహానికి విచ్చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు భద్రాచలం భారతీయ జనతా పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా బీజేపీ భద్రాచలం నియోజకవర్గం తరఫున బండి సంజయ్ కుమార్‌ను శాలువాతో సత్కరించి ఆత్మీయంగా స్వాగతించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై నాయకులు ఆయనతో చర్చించారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ భద్రాచలం పర్యటనతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు భద్రాచలం ప్రాంత అభివృద్ధి కోసం పార్టీ మరింత చురుకుగా పనిచేస్తుందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి



రాంమోహన్ రావు, అట్లూరి రఘురామ్, ముత్యాల శ్రీనివాస్, బోడ సత్యనారాయణ, ములిశెట్టి నిఖిల్, అన్నెం సాయి లక్ష్మణ్, మాలోత్ సాయి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందూరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి..

## - సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** ఇందూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించి నిధులు మంజూరు చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ కోరారు.అసెంబ్లీలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....నగర అభివృద్ధి కొరకు స్పెషల్ ఫండ్ రూ.200 కోట్లు ఇవ్వాలన్నారు.అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్,తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఫార్మసీ కళాశాల మంజూరు చేయాలని కోరారు.నగరంలో ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఔటర్ రింగ్ రోడ్ లను మంజూరు చేయాలన్నారు.గతంలోనూ అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు.ప్రధానంగా ఇందూరులో మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని,కళాభారతి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు.రాజారాం స్టేడియం ఆధునికీకరణతో పాటు పాత కలెక్టరేట్ మైదానంలో సింథటిక్ ట్రాక్ తో కూడిన స్టేడియం,అలాగే ఇండోర్ స్టేడియం మంజూరు చేయాలని కోరారు.రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇందూరు ఖిల్లా రామాలయం అభివృద్ధితో పాటు రెవెన్యూ శాఖ నుంచి దేవాదాయ శాఖకు



బదిలీ చేయాలన్నారు.జిల్లా జనరల్ ఆసుపత్రిలో మరమ్మత్తులు,మౌలిక సౌకర్యాలకు నిధులు విడుదల చేయాలని,వైద్యుల సిబ్బంది కొరత లేకుండా చూడాలని కోరారు.ముఖ్యంగా బస్టాండ్ ఆధునికీకరణ పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

# డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండీని కలిసిన మాజీ కార్పొరేటర్ శ్రీ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి

**వనస్థలిపురం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండీ శ్రీ అశోక్ రెడ్డి గారిని కలిసి వనస్థలిపురం డివిజన్‌లోని పలు కాలనీలలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.డివిజన్‌లోని కొన్ని కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కాలనీవాసులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వనస్థలిపురం డివిజన్‌కు అవసరమైన డ్రైనేజీ పనులను మంజూరు చేసి, సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండీ శ్రీ అశోక్ రెడ్డి గారిని కోరారు.ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం, కాలనీలలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయడమే తమ



లక్ష్యమని శ్రీ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు.

# ఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశకులు

## - అభయహస్తం మిత్ర బృందం ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం

**గజ్వేల్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణంలో గురు పూజోత్సవాన్ని పురస్కరించుకుని 'అభయ హస్తం మిత్ర బృందం' ఆధ్వర్యంలో మంగళవారం టీచర్స్ డే వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి,20 వ వార్డ్ కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, అయ్యప్ప దేవాలయ అధ్యక్షులు బొగ్గుల సురేష్, డాక్టర్ లింగం, కొమురవెల్లి దేవాలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ, కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ మెట్టయ్య అభయ హస్తం మిత్ర బృందం అధ్యక్షులు రావి కంటి చంద్రశేఖర్, సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో, రేపటి పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని కొనియాడారు. విద్యార్థుల్లో జ్ఞానాన్ని నింపి, మంచి క్రమశిక్షణ, సన్మార్గం వైపు నడిపించే గురువులను గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజానికి నిస్వార్ధ సేవ అందిస్తున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని అన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను, విద్యావేత్తలను అభయ హస్తం మిత్ర బృందం సభ్యులు మరియు అతిథులు శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి శుభా



కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సముద్రాల హరినాథ్, డాక్టర్ నరేష్ బాబు, కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ధి బిక్షపతి, నాచారం దేవస్థానం డైరెక్టర్, అయ్యప్ప ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జగ్గయ్యగారి శేఖర్, ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ, కోశాధికారి నారాయణరెడ్డి,ఎర్రం శ్రీనివాస్ గురుస్వామి, అభయ హస్తం మిత్ర బృందం సభ్యులు, నంగునూరు విజయ్, దొంతుల సత్యనారాయణ, ఆర్యవైశ్య నాయకులు, స్థానిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## 11న ఖమ్మంలో ప్రైవేటు ఉద్యోగాల ఖాళీల భర్తీకి జాబ్ మేళా

### - జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి

**ఖమ్మం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 11 న (శుక్రవారం) నాడు ఖమ్మంలోని హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టీటీడీసీ నందు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎన్. మాధవి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళా ద్వారా ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లో 'సెంటర్ మేనేజర్, ఈఆర్ఓ, ఎల్ఆర్ఓ -రూరల్ మైక్రో లోన్స్' విభాగంలో 20 ఖాళీలను భర్తీ చేయనున్నారన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి, 18 నుండి 30 సంవత్సరాల వయస్సు ఉన్నవారు వీటికి అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ. 15,000 జీతంతో పాటు ఇన్సెంటివ్‌లు ఉంటాయన్నారు. అలాగే రిలయన్స్ జియో ఖమ్మం విభాగంలో 'ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్'గా 5 ఖాళీలు ఉన్నాయని ఉపాధి కల్పనాధికారిణి తెలిపారు. పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ పూర్తి చేసి, 18 నుండి 25 సంవత్సరాల వయస్సు ఉన్న యువకులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 14,000 నుండి రూ. 25,000 వరకు వేతనం అందజేస్తారని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో శుక్రవారం రోజున జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని అన్నారు. ఇతర వివరాల కోసం 9448241214 లేదా 9391539320 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కాళోజీ అడుగుజాడల్లో నడవాలి : శిక్షణా సహాయ కలెక్టర్ పారస్ కుమార్

### - ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు





**ఖమ్మం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** తెలంగాణ వైతాళికుడు, ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి (తెలంగాణ భాషా దినోత్సవం) వేడుకలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి శిక్షణా సహాయ కలెక్టర్ పారస్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పారస్ కుమార్ మాట్లాడుతూ సమాజంలోని అన్యాయాలను, అక్రమాలను తన కలం బలం ద్వారా ఎండగట్టిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజాచైతన్యమే ఊపిరిగా జీవించిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని, ఆయన చూపిన బాటలో, అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, కేర్ టేకర్ వెంకన్న, సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని కాళోజీ నారాయణరావు సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు.

# కేసీఆర్‌పై 'మరణ' వ్యాఖ్యలు

- షాద్‌నగర్ ఎమ్మెల్యే తీరుపై బీఆర్ఎస్ భగ్గు
- హాని చేయడానికి ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణ
- ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి కఠిన చర్యలుతీసుకోవాలని డిమాండ్
- కేసీఆర్ భద్రతను తక్షణమే సమీక్షించాలని కోరిన ఖమ్మం బీఆర్ఎస్ నేతలు



**ఖమ్మం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయని బీఆర్ఎస్ ఖమ్మం నాయకులు అన్నారు. కేసీఆర్ మరణాన్ని కోరేలా, ఆయనకు హాని కలిగించే విధంగా ప్రేరేపించే ధోరణిలో వ్యాఖ్యలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని మండిపడ్డారు.సెప్టెంబర్ 8న ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా, ఆర్ టివి లో ప్రసారం ద్వారా విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయని తెలిపారు. రాజకీయ ప్రత్యర్థిపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, హింసకు దారితీసేలా వ్యాఖ్యలు చేయడం మాత్రం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం మౌనం వహించకూడదని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఒక ప్రజాప్రతినిధి చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో ఉద్రిక్తతలకు, అనుచరుల మధ్య ఘర్షణలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఎమ్మెల్యే శంకరయ్య చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై సమగ్ర దర్యాప్తు జరిపి, భారతీయ న్యాయ సంహితలోని నిబంధనల మేరకు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వ్యాఖ్యల వెనుక ఉద్దేశం ఏమిటి, వాటి వల్ల ఎలాంటి పరిణామాలకు అవకాశం ఉందన్న అంశాలపైనా దర్యాప్తు చేయాలని కోరారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రోత్సహించినా, సహకరించినా వారి పాత్రను కూడా విచారించాలని అన్నారు. ఈ వ్యాఖ్యల నిపథ్యంలో కేసీఆర్ భద్రతను ప్రభుత్వం తక్షణమే సమీక్షించాలని బీఆర్ఎస్ ఖమ్మం నాయకులు డిమాండ్ చేశారు. ఆయనకు ఎలాంటి హాని జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలకు ఒక పరిమితి ఉండాలని, ఆ పరిమితి దాటితే ప్రభుత్వం చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్, మాజీ కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, దండ జ్యోతిరెడ్డి అయ్యప్ప రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, దేవభక్తుని కిషోర్ బాబు, కొనకంచి ప్రసాద్, కోలేటి రాధాకృష్ణ, జాబిశెట్టి శ్రీనివాసరావు, చిలకల వెంకట నరసయ్య, పొదిలి నాగరాజు, యాకూబ్ పాషా, మారగాని సుదర్శన్, వంగవీటి శ్రీనివాసరావు, చల్లగుండ్ల నరసింహారావు,తదితరులు పాల్గొన్నారు.

## రావులపాడులో సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు శ్రీకారం



**ఇల్లందు, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** కోయగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రావులపాడు గ్రామంలో సీసీ డ్రైన్ నిర్మాణ పనులను ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , గ్రామ సర్పంచ్ కోరం సుభాష్ చంద్రబోస్ కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అవసరమైన డ్రైనేజీ సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కొండారెడ్డిపల్లి 2వ వార్డులో డ్రైనేజీ అభివృద్ధి పనులకు శ్రీకారం

### రాజేశ్వర్‌రెడ్డి, మహేష్‌ప్రసాద్ లను కుటుంబాలను పరామర్శించిన జర్నలిస్టు నాయకులు



**కేశంపేట, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలోని రెండోవ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్, డిప్యూటీ సర్పంచ్ కర్నెకోట నరేష్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు.వార్డులో మురుగునీరు నిల్వ ఉండటంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, నీరు సక్రమంగా ప్రవహించేలా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. పనులు పూర్తయితే మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా మారి ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణం అందుబాటులోకి వస్తుందని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు.2వ వార్డు సభ్యుడు అరవింద్ ప్రజాపతి మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. వార్డు అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో వార్డును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ప్రేమ్ కుమార్ గౌడ్, జగన్మోహన్ రెడ్డి, సురం శ్రీను, దశరథ్, రామకృష్ణ రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

## గోలియాతండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



**ఇల్లందు, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** టేకులపల్లి మండల పరిధిలోని గోలియాతండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఇల్లందు నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, వాటి నిర్వహణ తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా నూతనంగా నిర్మిస్తున్న బాత్రూమ్‌లను, ఆర్‌వోఆర్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి, వాటి వినియోగం, నిర్వహణకు సంబంధించిన వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బాత్రూమ్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి సూచించారు. పనులు ఆలస్యం చేస్తే ఈ విషయాన్ని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లాల్సి వస్తుందని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు.అనంతరం పాఠశాలలోని స్టోర్‌ను తనిఖీ చేసి, స్టోర్ తాళాల నిర్వహణ, అందుబాటులో ఉన్న సామగ్రి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం, స్వచ్ఛమైన తాగునీరు, అవసరమైన మౌలిక సదుపాయాలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా విద్యార్థుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.ఈ తనిఖీలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు లకావత్ లాలు, శేఖర్, ప్రధానోపాధ్యాయులు మోహన్‌రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బేషరత్ గా క్షమాపణ చెప్పాలి

### - పల్లా కిరణ్ కుమార్



**ఖమ్మం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** రాజ్యాంగబద్ధంగా నియమితులైన దళిత బిడ్డ తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బి.ఆర్.ఎస్ శాసనమండలి సభ్యులు తాత మధు అభ్యంతరకర పదజాలంతో దూషిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా వ్యక్తిగతంగా తీవ్రంగా ఖండి స్తున్నాం అని పల్లా కిరణ్ తెలిపారు. తక్షణమే భేషరతుగా క్షమాపణ చెప్పా లని డిమాండ్ చేశారు. దేశ ప్రజల హక్కుల కోసం తన జ్ఞానాన్ని, జీవితాన్ని ధారపోసిన త్యాగమూర్తి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై తీవ్ర వ్యాఖ్యలు చేసి అవమానించిన హమారా ప్రసాద్‌పై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం అని తెలిపారు. దళితుల ఆత్మగౌరవం, వివక్షల పై ఇప్పటికి పోరాడాల్సిన పరిస్థితి రావడం చాలా బాధాకరమైన విషయం.ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సహించేది లేదు, భారీ ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నాం అని పల్లా కిరణ్ కుమార్ తెలిపారు.

## ఖమ్మం బిఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ సాంస్కృతిక సౌరభం, ప్రజాకవి, కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా ఘన నివాళులు



**ఖమ్మం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా ఘనంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు ఘనంగా నివాళులు ఆర్పించారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమలరావు, బొమ్మెర రామ్మూర్తి, హెచ్ ప్రసాద్, ఆరెంపుల వీరభద్రం, బలుసు మురళి కృష్ణ, కోడిరెక్కల ఉమా శంకర్, సద్దాం, మొహమ్మద్ రఫీ, నారమళ్ళ వెంకన్న, పిడదల రామ్మూర్తి, కోడిరెక్కల ఫ్రాన్సిస్, వెంకట్ మరియు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నివారణ చర్యలపై అవగాహన



**ఖమ్మం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** మల్బరీలో వేరు కుళ్లు తెగులు నివారణపై సాంకేతిక ప్రదర్శనమేరా రేశం మేరా అభిమాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా, 9 సెప్టెంబర్ 2026న తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా, ఎర్రుపాలెం మండలం, నారాయణపురంలో కేంద్ర సిల్క్ బోర్డు, బెంగళూరు, తెలంగాణ రాష్ట్ర సెరికల్చర్ శాఖ సమన్వయంతో మల్బరీలో వేరు కుళ్లు తెగులు నివారణపై సాంకేతిక ప్రదర్శన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. సుబ్రహ్మణ్యం, సి ఎస్బి అనుసూయ, జేడీ కామేశ్వరరావు, దేవరాజు పాల్గొన్నారు. రైతులకు సి ఎస్బి సిఫారసు చేసిన వేరు కుళ్లు తెగులు నివారణ సాంకేతికతలను ప్రదర్శించారు.

## మేరా రేషం మేరా అభిమాన్ 2.0" లో భాగంగా పట్టు పరిశ్రమపై అవగాహన కార్యక్రమం



**ఖమ్మం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** "మేరా రేషం మేరా అభిమాన్ 2.0" కార్యక్రమంలో భాగంగా, పట్టు పరిశ్రమ (సెరికల్చర్), రైతుల ఆర్థికాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం 2026 సెప్టెంబర్ 9న తెలంగాణలోని ఖమ్మం జిల్లా, ఏర్రుపాలెం మండలం, వెంకటాపురంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బెంగళూరులోని కేంద్ర పట్టు పరిశ్రమ మండలి (సెంట్రల్ సిల్క్ బోర్డ్), తెలంగాణ రాష్ట్ర పట్టు పరిశ్రమ శాఖ, వ్యవసాయ శాఖ సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. సుబ్రహ్మణ్యం (సెంట్రల్ సిల్క్ బోర్డ్), అనుసూయ (జాయింట్ డైరెక్టర్, సెరికల్చర్), వాణిశ్రీ (అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ), బండారు నరసింహారావు (ఏఎంసి చైర్మన్, మధిర), కామేశ్వరరావు (ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్), దేబరాజు (అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్) పాల్గొనగా, స్థానిక రైతులు కూడా పాల్గొన్నారు.ఎల్ నినో వంటి మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పట్టు పరిశ్రమ యొక్క ప్రాముఖ్యతను ఈ కార్యక్రమంలో ప్రధానంగా వివరించారు. పట్టు సాగు ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు, ఆర్థికాభివృద్ధి వ్యూహాలపై కూడా చర్చించారు.

## హియరింగ్ కేంద్రాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య



**ఖమ్మం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో సర్ –2026లో భాగంగా ఏర్పాటు చేసిన హియరింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం సందర్శించి పరిశీలించారు.ఉమెన్స్ డిగ్రీ కళాశాల, 35వ డివిజన్ బస్తీ దవాఖాన ఎదురుగా ఉన్న యోగాసన కేంద్రం, ఎస్ ఆర్ఎన్ బిజిఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హియరింగ్ కేంద్రాలను కమిషనర్ సందర్శించారు. ఆయా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఈఆర్ఓ లతో మాట్లాడి, ఈరోజు ఎంతమంది హాజరై హియరింగ్ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు, ఇప్పటివరకు ఎన్ని పూర్తయ్యాయి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, హియరింగ్ ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఎదురవుతున్నాయా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఉమెన్స్ డిగ్రీ కళాశాల కేంద్రంలో చిరంజీవి, ఏఈ, పిఆర్ యోగాసన కేంద్రంలో నవ్యజ్యోతి, ఏఈ, కేఎంసి, ఎస్ఆర్ ఎన్ బిజిఆర్ కళాశాల కేంద్రంలో కిరణ్ కుమార్, ఏఈ, ఇరిగేషన్ తదితర అధికారులతో కమిషనర్ మాట్లాడి హియరింగ్ ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు.అదేవిధంగా హియరింగ్ కేంద్రాలకు వచ్చిన ప్రజలతో కమిషనర్ స్వయంగా మాట్లాడి, ఏ సమస్య లేదా కారణంతో హియరింగ్‌కు వచ్చారు, అధికారులు వివరాలను అర్థమయ్యే విధంగా తెలియజేస్తున్నారా, ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.హియరింగ్ కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన ఫారాలు, ప్రక్రియకు సంబంధించిన వివరాలను స్పష్టంగా తెలియజేసి, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా హియరింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని ఏఈఆర్ఓ లను కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు.

## "మాట్లాడండి, ప్రాణాలను కాపాడండి"

**- ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా రామారావు పిలుపు**

**ఖమ్మం, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10న నిర్వహించే ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రజలకు, ముఖ్యంగా తల్లిదండ్రులు, యువతకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది అంతర్జాతీయంగా ఆత్మహత్యలపై దృక్పథాన్ని మార్చుకుందాం – సంభాషణను ప్రారంభిద్దాం అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

**మారుతున్న సమాజం**

**— చిన్న కారణాలకే బలవన్మరణాలు:**

గతంలో అతిపెద్ద సమస్యలు లేదా తీవ్ర సంక్షోభాలు ఎదురైనప్పుడు మాత్రమే విపరీత నిర్ణయాలు తీసుకునేవారని, కానీ నేటి రోజుల్లో అతి చిన్న కారణాలకే ప్రాణాలు తీసుకోవడం అత్యంత ఆందోళనకరమని డి ఎం హెచ్ ఓ డాక్టర్ రామారావు పేర్కొన్నారు

**ప్రస్తుత పరిస్థితుల్లో కనిపిస్తున్న ప్రధాన లోపాలు :**

ఓపిక, సహనం లోపించడం, తక్షణ ఫలితాలు ఆశించడం, చిన్నపాటి ఆలస్యం లేదా నిరాశను భరించలేకపోవడమని., కష్టపడే తత్వం, సర్దుబాటు తగ్గడం, పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోయే, మానసిక దృక్పథం కొరవడటమని, క్రీడలకు దూరం కావడం, మైదానాల్లో ఆటలాడకపోవడం వల్ల పిల్లల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం, స్నేహభావం తగ్గుతున్నాయని, ఓటమిని అంగీకరించక పోవడం, ఆటల్లో గెలుపోటములు సహజమనే భావన లేకపోవడం వల్ల, నిజజీవితంలో చిన్న వైఫల్యం ఎదురైనా జీర్ణించుకోలేక తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఆర్థిక ఒత్తిళ్లు అండ్ డిజిటల్ అలవాట్లు, ఆడంబరాల జీవనశైలి, అప్పులు, స్క్రీన్లకు అతుక్కుపోయి కుటుంబ సభ్యులతో ముఖాముఖి సంభాషణలు తగ్గడం ఒంటరితనానికి దారి తీస్తున్నాయని,తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు విజ్ఞప్తి: పిల్లలపై కేవలం మార్కులు, ర్యాంకుల ఒత్తిడి మాత్రమే రుద్దకుండా వారిలో మానసిక స్థైర్యాన్ని, జీవన నైపుణ్యాలను పెంపొందించాలని, నిత్యం ఆడుకునేలా ప్రోత్సహించాలని,ఆటల ద్వారానే గెలుపును ఎలా ఆస్వాదించాలో, ఓటమిని ఎలా తట్టుకోవాలో తెలుస్తుందని, ఇంట్లో కనీసం రోజుకు 30 నిమిషాలు గ్యాడ్జెట్లు పక్కనపెట్టి పిల్లల భావోద్వేగాలను, సమస్యలను ఓపికగా వినాలని,ఉచిత మానసిక సహాయం కోసం టెలి-మానస్ మానసిక ఆందోళన, నిరాశ లేదా ఆత్మహత్య ఆలోచనలు ఉన్నవారు భయపడకుండా లేదా



దాచకుండా వెంటనే ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టెలి-మానస్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని కోరారు. టోల్ ఫ్రీ నంబర్లు: 14416 లేదా 1800-89-14416 (24 గంటలూ అందుబాటులో ఉంటాయని). ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మానసిక వైద్య విభాగం, అలాగే జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కౌన్సిలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని,ఆత్మహత్య అనేది సమస్యకు పరిష్కారం కాదని, కష్టాలను ఎదుర్కొనే ధైర్యాన్ని నింపేందుకు కుటుంబం, సమాజం తోడుగా నిలవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి రామారావు పిలుపు నిచ్చారు.

## రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కెంచి కిష్టయ్యకు ఘన నివాళులు

- **విద్యా రంగంలో ఆయన సేవలు చిరస్మ-రణీయం: -డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు**



**షాద్ నగర్, సెప్టెంబర్ 9, నేటి శుభోదయ :** రిటైర్డ్ హెడ్‌మాస్టర్, కీర్తిశేషులు కెంచి కిష్టయ్య ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆయన 14-03-1943న జన్మించి, 30-08-2026న తుదిశ్వాస విడిచారు. సౌమ్య స్వభావంతో అందరితో ఆప్యాయంగా మెలుగుతూ, విద్యా రంగంలో తనదైన సేవలను అందించిన కిష్టయ్య మృతి కుటుంబ సభ్యులతో పాటు ఆయనను అభిమానించే వారందరికీ తీరని లోటని పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమానికి ప్రముఖ సామాజికవేత్త, మానవ హక్కుల సంఘం నాయకులు, సీనియర్ పాత్రికేయులు డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు హాజరై కీర్తిశేషులు కెంచి కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు మాట్లాడుతూ, “కిష్టయ్య ఉపాధ్యాయుడిగా ఎంతోమంది విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకంగా నిలిచారు. పదవీ విరమణ చేసిన తరువాత కూడా తన పరిచయస్తులు, బంధువులు, సమాజంలోని ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మెలిగిన వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మనిషి జీవిత కాలం కంటే, ఆయన చేసిన మంచి పనులు మరియు ఇతరుల హృదయాల్లో సంపాదించుకున్న స్థానం శాశ్వతం. కిష్టయ్య సేవలు, మంచితనం, మానవీయ విలువలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయి” అని అన్నారు.అలాగే కీర్తిశేషులు కెంచి కిష్టయ్య అల్లుడు, సీనియర్ న్యాయవాది నారని రమేష్ బాబు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “కిష్టయ్య మృతి మా కుటుంబానికి తీరని లోటు. ఆయన ప్రేమ, ఆప్యాయత, పెద్దరికం ఎప్పటికీ మా హృదయాల్లో నిలిచిపోతాయి. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి. ఆయన చూపిన మంచిమార్గంలో ముందుకు సాగడమే ఆయనకు అందించే నిజమైన నివాళి” అని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.కిష్టయ్య గారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కార్యక్రమానికి హాజరైన వారు ప్రార్థించారు.ఈ దశదిన కర్మ కార్యక్రమంలో రిటైర్డ్ బ్యాంక్ అధికారి బాలకృష్ణ, ప్రముఖ ఈఎన్టీ సర్జన్ డా.ప్రవహర్, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి రుక్కుద్దీన్, టీడీపీ నాయకుడు మహమ్మద్ మహమ్మద్, మానవతావాది డాక్టర్ అమీర్ ఇక్బాల్, హ్యూమనిస్ట్ బొబ్బిలి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొని కీర్తిశేషులు కెంచి కిష్టయ్యకు ఘన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620